# చట్టంలో లేని తీర్పు

మనోహర్, వర్మ మాట్లాడు కొంటూండగా "మే ఐ కమిన్" అన్న తీయని గొంతు వినిపించింది.

వాకిట్లో బంగారు తీగెలా నిలబడి ఉంది శైలజ.

"హాయ్ శైలూ వెల్ కం" అంటూ ఆహ్వానించాడు మనోహర్

"కూర్చోండి" అన్నాడు వర్మ కలుపుగోలుగా.

మనోహర్‌కు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చొంది శైలజ.

ఈజీ ఛైర్‌లో కూర్చున్న వర్మ శైలజను చూసి ఆఖరుదమ్ము లాగి సిగరెట్ ఆర్పి కిటికీలోంచి బయట పడేట్లు విసిరాడు.

"ఏమిటీ చెప్పాపెట్టకుండా వచ్చేసావ్' అన్నాడు మనోహర్ ఉత్సాహంగా.

"ఎప్పుడు వచ్చినా వెల్‌కం చెబుతావుగా. అందుకనే చెప్పాకుండా వచ్చేసాను" తెల్లని పలువరస కనబడేట్లు నవ్వింది శైలజ.

"ఏధి ఏమైనా ఊరకరారు మహానుభావులు" నవ్వుతూ అన్నాడు వర్మ.

"నాకు తెలుసు మీ బాధ. నేను వచ్చి మీ సిగరెట్ ఆర్పించాననేగా"

"ఆహా... అదేం కాదండోయ్"

"అసలు నిజానికి మీరు నాకు చాలా ఋణపడి ఉన్నారండి. నేను మీ గదిలోకి వచ్చి మీ సిగరెట్లు ఎన్ని పొదుపు చేస్తున్నానని"

"కరెక్ట్. నీవో గంట కూర్చుంటే మా వాడికి దాదాపు అరడజను సిగరెట్లు ఆదా అవుతాయి. అంటే సుమారు ఆరు రూపాయలు"

"అలా అయితే రోజూ వస్తాను. నెలకు రెండొందలు నా పేరు మీద బాంకులో వేయండి, మీకు ఆరోగ్యం మిగులుతుంది. నాకు డబ్బొ వస్తుంది"

నవ్వాడు వర్మ.

"రేపు మన పెళ్లయినా వర్మ మనతోనే ఉంటాడు. వాడి చేత సిగరెట్లు మాన్పించే బాధ్యత నీది"

మనోహర్ మాటలకు శైలజ ముఖకవళికలు మారాయి.

"ఏమిటో మనోహర్ మన వివాహానికి ఏవేవో అడ్డంకులు వస్తున్నాయి" బాధగా అంది.

వర్మ ఈజీఛైర్‌లోంచి లేచి చెప్పులేసుకొన్నాడు.

"ఉండండి వర్మగారూ. ఇందులో రహస్యాలేమీ లేవు" అంది శైలజ.

"మళ్ళీ ఇప్పుడే వస్తాను."

"త్వరగారండి. మీతో కూడా ఈ విషయాలు చర్చిస్తే ఏదో ఒక పరిష్కారం దొరక్కపోదు." అంది శైలజ అశగా.

"అలాగే" అంటూ తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

"పూర్‌ఫెలో. పానకంలో పుడకలా తను దేనికి మధ్యలో అనుకొంటాడు వీడు"

"నాకెందుకో అలా అనిపించడం లేదు."

"ఛ... నీకేం తెలుసు శైలూ. వాడ్ని చిన్నతనం నుంచి నేనెరుగుదును. ఎప్పుడూ నన్నంటి పెట్టుకొని తిరిగేవాడు. నా కోసం ఏమైనా చేస్తాడు"

"పోనీలే. అతను వెళ్ళడం కూడా ఒకందుకు మంచిదే. ఇప్పుడు కొత్త చిక్కొకటి వచ్చిపడింది."

"మన ప్రేమ వ్యవహారం మొదలయినప్పటి నుండి ఏదో ఒక చిక్కు వచ్చి పడుతూనే ఉందిగదా"

"తమాషా కాదు మనోహర్. సీరియస్‌గా చెబుతున్నాను. మా ఇంటి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది."

"ఏమని"

"మా ఆఫీసులో సెక్షను ఆఫీసరుగా ఉన్న నారాయణరావు అనే అతను నేను నచ్చానని మా ఇంటికి ఉత్తరం వ్రాసాడట, మా అమ్మా, నాన్న దానికి ప్రతిగా అతనికి ఏదో బాదనారాయణ చుట్టరికం కలిపి ఈ సంబంధం తమకు నచ్చిందని, ఖాయం చేసుకుందామని ఉత్తరం వ్రాసారు."

"అయితే నువ్వేమంటావ్"

"ఛ... నువ్విలా అడుగుతావని అనుకోలేదు మనోహర్" కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

"ఇంత చిన్న విషయానికే బాధపడితే ఎలా? అసలు జరిగిందేమిటో చెప్పు" అన్నాడు ఆమెను ఓదారుస్తూ.

"నా కిప్పుడే పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదని, పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చినప్పుడు తప్పక తెలియజేస్తానని వ్రాసాను. మనోహర్ ఇక ఆలస్య చేస్తే లాభంలేదు. తొందరగా మన వివాహం జరిగిపోవాలి."

ఆలోచించసాగాడు మనోహర్,

"మన వివాహం రిజిస్ట్రారు ఆఫీసులో జరగడం, ఇంటికి టెలిగ్రాం ఇవ్వడం వెంటవెంటనే జరిగిపోవాలి మనోహర్" ఖండితంగా చెప్పింది శైలజ.

"నాకు వచ్చే నెల మొదటి తేదీ నుంచి ఆరు నెలల పాటు ఢిల్లీలో ట్రైనింగ్ ఉంది ఎలా?"

"వివాహం చేసుకొని వెళ్ళు"

మనోహర్ నవ్వుతూ "శైలూ నీకు తెలుసు వివాహం తరువాత జరిగే ఫలితం, వివాహం వరకు ఏ సుఖం కోసమైతే దూరంగా ఉన్నామో వివాహమయిన తర్వాత ఆ సుఖానికి దూరంగా ఉండలేం" అన్నాడు.

"అది మనసును నిగ్రహించు కొనే దాంట్లో ఉంది"

"ఆ శక్తి నీకుందేమోగాని నాకు లేదు. పెళ్ళి అనే ఆ అడ్డే ఇప్పటివరకూ నన్ను దూరంగా ఉంచింది, లేకపోతే నోరూరించే ఈ బంగారు దేవతను వదలి పెడతానా?"

సిగ్గుతో తలవంచుకొంది శైలజ.

"ఈ ఆరు నెలల ట్రైనింగ్ పాసయితే నేనెంత పెద్ద హోదాలోకి వెల్తానో నీకు తెలుసుగా! ఆ హోదా నీది కాదా. ఆరు నెలలు ఓపిక పట్టు" లాలనగా అన్నాడు.

శైలజ మనోహర్ చేతిని తన చెంపకానించుకొని, "ఛ... నేను వివాహనికి తొందరపడేది ఇంట్లో వాళ్ళ బాధ పడలేకనే గాని దాని కోసం కాదు" అంది సిగ్గుగా.

• • •     • • •     • • •

మనోహర్ ట్రైనింగ్‌కు వెళ్ళి అప్పుడే నాలుగు నెలలయింది. గదిలో వర్మ ఒక్కడే ఉంటున్నాడు. వర్మకి మనోహర్‌కి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు సాగుతున్నాయి. శైలజ రెండు సార్లు వర్మ గదికి వచ్చింది. మనోహర్ దగ్గరున్న పుస్తకాలు తీసుకోవడాని కొకసారి, ఇంకొకసారి మనోహర్ ట్రైనింగ్ మధ్యలో వచ్చినప్పుడు.

మనోహర్ ఈ నెలాఖరులో వస్తున్నానని మరొకసారి ఉత్తరం వ్రాశాడు. అందుకోసం ఎదురు చూస్తున్నారు వర్మ, శైలజ. కాని వస్తానన్న ముందు రోజు టెలిగ్రాం ఇచ్చాడు మనోహర్. తాను రావడం లేదని, ట్రైనింగ్ పూర్తయింతర్వాత ఒకేసారి వస్తానని. ఈ విషయం శైలజకు ఫోను చేసి చెబుదామను కొన్నాడు వర్మ.

తన ఆఫీసు నుంచి రెండు సార్లు ప్రయత్నించినా శైలజ దొరకలేదు. ఆ సాయంత్రం గదికొచ్చి స్నానం చేసి లుంగీ కట్టుకుని రిలాక్సింగ్‌గా కూర్చొని ఏదో మేగజైన్ చూస్తుండగా వచ్చింది శైలజ.

అందమైన ముఖం, ఎత్తైన వక్షస్థలం, ఎర్రని పెదవులు, గులాబీ రంగు మేను, సన్నని నడుం ఎంతో అందంగా ఉంది.

నిజానికి శైలజ మనోహర్ కంటే తనకు ముందే పరిచయం, తనే ఆమెను మనోహర్‌కి పరిచయం చేసాడు. ఎన్నో ఏళ్ళుగా ఆమె ముగ్ధ మోహన రూపం తన మనసులో ముద్రింపబడి ఉంది. అయితే అది బయటపెట్టుకోలేక పోయాడు. ఇంతలో ఆమె తన స్నేహితుడు మనోహర్‌ని గాఢంగా ప్రేమించింది. అందుకే వారిద్దరూ కలసి సరస సంభాషణలు గావిస్తోంటే

అతనికి కడుపులో దేవినట్లుగా ఉంటుంది. అందుకే అక్కడి నుండి లేచిపోతూంటాడు. స్నేహితుడి ప్రియురాలు అన్న విషయం గుర్తొచ్చి తన పాడు ఆలోచనలను ప్రక్కకు నెట్టాడువర్మ,

అందుకే ఆమెను నవ్వుతూ ఆహ్వానించాడు.

శైలజ అతని కెదురుగా కూర్చీలో కూర్చొంది.

"విషయమేమిటో చెప్పండి. ఉదయం రెండుసార్లు ఆఫీసుకు ఫోను చేసారట. నేనులేను."

"చెప్తాను, కూర్చోండి." అంటూ టేబులు డ్రాయరు లాగి అందులో ఉన్న టెలిగ్రాం ఆమెకు అందించాడు.

చదవడం పూర్తిచేసి "ఏమిటీయన రేపొస్తానని ఊరించి ఇలా డిసప్పాయింట్ చేశాడు. వెరీబాడ్" అంది.

"పాపం వాడికి ట్రైనింగ్ ఫోబియా పట్టుకొన్నట్టుంది. అటూ ఇటూ తిరుగుతూంటే క్లాసులు మిస్సయి సక్సెస్ కాననుకున్నాడేమో"

"నిజమే" ఆమె ఎర్రని పెదవులు విచ్చుకొన్నాయి.

"నేనిక వస్తానండి వర్మగారూ, రేపో, ఎల్లుండో నాకూ ఒక ఉత్తరం రావచ్చు" అంటూ లేచి నిలబడింది.

"జస్ట్ టూ మినిట్స్, టీ తెస్తాను" అన్నాడు వర్మ.

"లేదండి, వెళ్ళాలి ఏడున్నరయింది"

"అబ్బే ఎంతసేపండి ఇప్పుడు తేనూ"

"వద్దు, వద్దు" మొహమాటంగా అంది.

"ప్లీజ్. అదేం మాట శైలజగారూ, ఇక్కడ మీకేం మొహమాటం. ఇంతదూరం వచ్చినందుకు టీ ఇవ్వడం నా కనీస కర్తవ్యం" అంటూ బలవంతంచేసాడు.

ఇక కూర్చోక తప్పలేదు.

వర్మ కొద్దిసేపట్లో టీ తయారు చేసి రెండు కప్పుల్లోకి వంచి ట్రేలో పెట్టుకొని వచ్చాడు.

ఒక కప్పు శైలజకు అందించి, ఇంకో కప్పు తను తీసుకున్నాడు. టీ త్రాగిం తరువాత కప్పులు తీసుకొని లోపలికి వెళ్ళబోయాడు.

ఆమె కప్పు ఇవ్వలేదు "ఆడదాన్ని నేనిక్కడుండి మీ చేత ఎంగిలి కప్పులు కడిగించడమా. నాన్సెన్స్ నే కడుగుతాను. మీరు కూర్చోండి"

"ఇందులో తప్పేముందండి" అన్నాడు వర్మ.

"తప్పొప్పుల ప్రసక్తికాదు. కప్పులు నేను కడుగుతాను" అంటూ వంట రూములోకి వెళ్ళి సింక్ దగ్గర కడగసాగింది.

వర్మ ఏమనలేక గమ్మున కూర్చొండి పోయాడు. ఇంతలో ఎలక్ట్రిసిటీ పోయింది. ఇల్లంతా చీకటి మయమయింది.

"వర్మగారూ, వర్మగారూ" అంటూ పిలిచింది.

"యస్. నేనిక్కడే ఉన్నాను శైలజగారూ, జాగ్రత్తగా రండి"

"ఏం కనబట్లేదండి టార్చి ఎక్కడ"

"టార్చిషెల్ఫులో ఉంది. మీరు వెతుక్కోలేరు, స్టౌ ప్రక్కనే మాచ్ బాక్సు, కాండిల్సు ఉన్నాయి కాండిలు వెలిగించండి"

"వర్మగారూ! ఏం కనింపించడం లేదండి"

"నే వస్తున్నా నుండండి"అంటూ చేతులు చాచి తడుము కొంటూ నడవసాగాడు, పదడుగులు వేసేసరికి అతని రెండు చేతులు అమె మెత్తని గుండెలకు తగిలాయి.

"మైగాడ్" ఆదిరిపడింది శైలజ.

"సారీ" లజ్జగా అన్నాడు వర్మ,

"ఇల్సాల్ రైట్, ముందు టార్చి వెతకండి"

"అలాగే" అంటూ ఒకడుగు ముందుకు వేసాడు.

ఇంతలో శైలజమీద ఏదో పడింది.

"అమ్మో" అంటూ ఒక కేక పెట్టి వర్మను పెనవేసుకొంది.

"ఏమిటండీ, ఏమిటి"

"ఏమోనండి, ఏదోపడింది. శరీరమంతా ప్రాకుతోంది" అంది భయం భయంగా,

"అరరె, ఎక్కడ" అంటూ ఆదుర్దాగా తనను హత్తుకు పోయిన శైలజ శరీరాన్నంతా తడిమాడు,

ఎత్తైన పర్వతాలు, ఊహకందని లోయలు, సమతలమైన మైదానాలు, కొండల్ని ఒరుసుకొంటూ వేగంగా క్రిందికి దూకే జలపాతాలు, ప్రశాంతంగా ప్రవహించే నదులు, వాటి మలుపులు ఉద్యానవనాలు అందులోని సుగంధ మాధుర్యాలు, కొలనులు అందులోని కలువలు, శైలజ నైసర్గిక స్వరూపం వర్మను పిచ్చివాడ్ని చేసింది.

బిగువైన ఆమె శరీరావయవాల రాపిడి మనసు పొరల్లో అణగి ఉన్న అతని వ్యామోహాన్ని నిజృంభింప చేసాయి. అవి అత్యంత దురదృష్టకరమైన క్షణాలు,

"వర్మా" అంటూ గావుకేక వేసింది శైలజ. కాని అతని పశుబలం ముందు ఆమె కేకలు గాలిలో కలిసిపోయాయి. ఆమె అతని చేతిలో ఓడిపోక తప్పలేదు.

ఓ పదినిముషాల తరువాత....

"వర్మా, నువ్వెందుకిలా రాక్షసుడుగా మారావు. నా జీవితాన్ని కాలరాచిన తర్వాత గాని నీ కక్ష తీరలేదా" గుండె పగిలేట్లు ఏడుస్తోంది శైలజ.

వర్మ ఆవేశం చల్లబడిపోయింది, సైలెంట్‌గా వెళ్ళి టార్చి వెతికి తీసుకొచ్చాడు. తరువాత కాండిల్సు వెలిగించాడు. ఆ వెలుగులో రెండు చుంచెలుకలు ఆ మూలనుంచి ఈ మూలకు పరుగెత్తాయి.

తల పట్టుకొని కుర్చీలో కూర్చున్నాడు వర్మ. ఎదురుగా వాడిన గులాబీలా వచ్చి నిలబడింది శైలజ. ఆమెను చూడగానే తను ఆవేశానికి ఫలితంగా చేసిన తప్పు అంతకంతకు పెద్దదై అతని కళ్ళముందు నోరుతెరుచుకొని ఉన్న రాక్షసిలా కనిపించ సాగింది. తను స్నేహితుడికి చేసిన ద్రోహానికి, స్నేహితురాలు శైలజకు చేసిన అన్యాయానికి ప్రాయశ్చిత్తం లేదను కొన్నాడు.

"శైలజగారూ! మిమ్మల్ని శారీరకంగా మలినం చేసాను, మిమ్మల్ని చేసుకొంటాను. మనోహర్ వచ్చేలోగా ఇది జరిగిపోవాలి"

"సారీ నీవు నన్ను చేసుకోదలచుకొన్నా నేను అందుకు సిద్ధంగా లేను" ఎటో చూస్తూ అంది శైలజ.

"కాని ఇంత పెద్దతప్పు చేసి స్నేహితుడి ముందు తలెత్తుకొని ఎలా నిలబడేది ఇంతకంటే చావేనయం"

"నీవు చావాల్సిన అవసరం లేదు మిస్టర్ వర్మా. ఒకరి జీవితాన్ని నాశనం చేసినందుకు పరిష్కారం ఇంకొకరి జీవితం నాశనం కావడం కాదు. ఏది ఏమైనా మనోహర్ భవిష్యత్ దృష్ట్యా ఈ విషయం ప్రస్తుతం  అతనికి తెలియ కూడదు" గంభీరంగా అంది.

ఆమె ధైర్యానికి ఆశ్చర్యపోయాడు వర్మ. ఆమె హృదయం మహోన్నతం అనుకొన్నాడు. ఇప్పుడు ఆమెను చూస్తే తనకు ఆవేశం రావడంలేదు. నమస్కారం పెట్టాలనిపిస్తోంది. అనుకొన్నాడు.

"అయితే  మీరేం చేయదలచు కొన్నారు."

"అవన్నీ ఇప్పుడు చెప్పను. అయితే ఈ మలినదేహాన్ని ఎప్పటికీ ఆయనకు అంకితం చేయలేను. ఇదిమాత్రం యదార్థం."

"అయితే మీరు ఏ అఘాయిత్యమూ చేయరుగా" అన్నాడు నీళ్ళు నిండిన కళ్ళతో. ఒక నిండు జీవితాన్ని నాశనం చేశాననే యధార్థం అతని కళ్ళముందు నాట్యమాడుతూ వుంది.

"అంత మానసిక బలహీనత నాకు లేదు. నా జీవితాన్ని నేను నిర్ణయించు కోగలను" కళ్ళనీళ్ళు తడుచుకొని హాండ్‌బాగ్ భుజాన తగిలించుకొని నెమ్మదిగా మెట్లుదిగి రోడ్డు మీదికి నడిచింది.

ఆమెను సాగనంపే ధైర్యంలేక వర్మ మెట్లమీద నిలబడి చూడ్డం తప్ప మరేమీ చేయలేక పోయాడు. గంట క్రితం నవ్వుతూ లోపలికి వచ్చిన శైలజ ఇప్పుడు ఏడుస్తూ వెళ్ళి పోయింది.

• • • • • • • • •

ఆ రోజు మనోహర్ ఢిల్లీ నుండి ట్రెయినింగు పూర్తి చేసుకొని వచ్చేరోజు. తను ఫలానా ట్రెయిన్‌లో వస్తున్నట్లు ముందుగానే శైలజకు, వర్మకు ఉత్తరాలు వ్రాసాడు. ఆ ఉత్తరం చూసినప్పటి నుండి వర్మ మనసు మనసులోలేదు. మనోహర్‌ని ఎలా ఎదుర్కోవాలో అతనికి అర్థం గాకుండా ఉంది. అందుకే దూరంగా ఒకచోట రూము మాట్లాడుకొన్నాడు. రెండ్రోజులు ముందుగానే సామాను అక్కడికి చేరవేసాడు. మనోహర్ గదితాళాలు క్రింద ఇంటి ఓనరు కిచ్చాడు.

మనోహర్ ముఖం చూపించడం ఇష్టంలేక ఆ పని చేసాడు. రేపు యదార్థం తెలుసుకొన్న మనోహర్ ఎదుట తను నేరం ఒప్పుకొంటాడు. తన జీవితాన్ని అంతం చేసుకోవాలా లేక మోడులాగా గడపాలా అనేది అతను తన ఎడల ప్రవర్తించే దాన్ని బట్టి ఉంటుంది.

అందుకే ఆ రోజు ఉదయం వర్మ స్టేషనుకు వెళ్లలేదు. ఆఫీసుకు సెలవుపెట్టి మధ్యాహ్నం నుంచి బార్‌కు వెళ్ళి అదేపనిగా త్రాగసాగాడు. తన గుండెల్లోని రంపపు కోత మరిచిపోయేంత వరకు త్రాగదలచుకొన్నాడు.

రాత్రి ఎనిమిదవుతుండగా ఎవరిదో బలమైన చేయి పడింది భుజం మీద.

"ఒరేయ్ వర్మా"

"ఎవరూ" అంటూ బలవంతాన కనురెప్పలు పైకెత్తి చూసాడు. ఎదుగారు మనోహర్. మత్తుచాలా వరకు దిగిపోయింది.

"వర్మా, పద వెల్దాం"

"ఎక్కడికి"

"ఎక్కడికేమిట్రా గదికి. నేను లేనని నన్ను ఒంటరిని చేసి వేరే గదిలోకి మారుతావా రాస్కెల్"

"ఎందుకో నాకక్కడ ఉండాలన్పించలేదు" అన్నాడు వర్మ.

పూర్ మనోహర్. అసలు విషయం తెలియదు. తన ప్రాణసమానమయిన ప్రియురాలి మానం హరించానని తెలిస్తే ఇంత అభిమానంగా పిలుస్తాడా. పాపం శైలజ కూడా తన భవిష్యత్తు దృష్ట్యా మనోహర్‌కు ఈ విషయం చెప్పినట్లు లేదు. తను ఆమె అందానికి మైకం కమ్మి ఆ సుఖం కోసం స్నేహితుడికి ద్రోహం చేశాడు. మరి శైలజ. తనతో శరీర సుఖాన్ని

పంచుకొని కూడా ఆ విషయం రహస్యంగా పెట్టి మనోహర్‌ని మోసంతో వివాహం చేసుకోబోతుంది కాబోలు. కాని నిజంగా మోసపోయినవాడు నిష్కల్మష హృదయంకల మనోహర్ మాత్రమే. త్రాగిన మైకంలో భోరున ఏడ్చేసాడు వర్మ.

"వెధవ సెంటిమెంట్లు నువ్వు. ముందు గదికి పద" అంటూ బలవంతంగా వర్మను ఆటోలో కూర్చో బెట్టాడు.

ఆటో మనోహర్ వుండే వీధివైపు పోసాగింది. మనోహర్ తన ఢిల్లీ అనుభవాలు చెబుతోంటే వర్మ గుండె తరుక్కు పోసాగింది. ఇంతప్లెయిన్‌గా ఉండే మనోహర్‌నా తను మోసం చేసింది, అని మధనపడ సాగాడు.

"ఒరేఫూల్, ముందుగా చెప్పినా స్టేషనుకెందుకు రాలేదురా" అన్నాడు చనువుతో కూడిన కోపంతో

వర్మ తల వంచుకున్నాడు. "నా ఉత్తరం అందిఉండదులే. గది మార్చావుగా" అన్నాడు అతనే మళ్ళీ.

'కాదురా ఫూల్. నీ ఉత్తరం చూచాకే గది మార్చాను' అనుకొన్నాడు వర్మ.

ఇద్దరూ మేడ మెట్లెక్కారు. గది తలుపులు తెరచి ఉన్నాయి.

ఎదుగారు కుర్చీలో తలవంచుకొని గోళ్ళు కొరుక్కుంటున్నదల్లా ఇద్దర్నీ చూసి తల ఎత్తింది శైలజ.

వర్మను కూర్చోమని చెప్పి లోపలకి వెళ్ళాడు మనోహర్.

ఎదురెదురుగా కూర్చొని ఉన్నారు శైలజ, వర్మ. మూడు కప్పుల్లోకి ప్లాస్కులోని టీని వంచాడు మనోహర్.

"ఇది శైలజ పెట్టిన టీ. త్రాగవోయ్ బాగుంటుంది." అన్నాడు మనోహర్.

అటంబాంబు పడ్డట్టు ఉలిక్కి పడ్డాడు వర్మ. ఏమిటీ వీడు మాట్లాడడం. విషయం తెలిసి తనను ఎద్దేవా చేయడం కాదుగదా.

"నేను వెళతానురా. ఇక ఉండలేను" అన్నాడు.

"ఉండండి" శైలజ కూడా అంది. కొన్ని నిముషాలు మౌనంగా గడిచాయి. ఆ కొద్ది సేపు మౌనమే వర్మకు భరింప శక్యం కాకుండా ఉంది.

"అయామ్ సారీరా, నా మనసేంబాగాలేదు. నేనిక్కడ ఉండలేను" లేచి రెండడుగులు వేసాడు.

"వర్మా! అగు. ఇందులో నీ తప్పేమీ లేదు. జరిగిందంతా నాకు శైలజ చెప్పింది. ఇది యాధృచ్చిక మని దీంట్లో మీ రెవరిదీ తప్పులేదని నా మనస్సాక్షికి తెలుసు. ఎవరికీ ఏ ఇబ్బందీ రాకుండా నేను పరిష్కారం చెబుతాను."

వర్మ శరీరం కంపించింది, తల వంచుకొని దోషిలా నిలుచున్నాడు. శైలజ కూడా నిశ్చలంగా ఎటో చూస్తూ ఉంది. ఈ పరిస్థితి ఒక్క మనోహర్‌కి తప్ప మిగతా ఇద్దరికీ చాలా భాధకరంగా వుంది.

"నేను శైలజను ఎప్పటిలాగే ప్రేమిస్తున్నాను. పెండ్లి కూడా చేసుకొంటాను. జరిగింది మర్చిపోయి మీరిద్దరూ నాతో ఫ్రీగా ఉండండి"

మనోహర్ విశాలహృదయానికి తెల్లబోయాడు వర్మ.

"నో" గట్టిగా అరిచింది శైలజ. "నేనిప్పుడు ప్రెగ్నెంట్‌ని"

మనోహర్ క్షణం చలించినా స్థిరంగా అన్నాడు. "కావచ్చు. నేను దానికీ భయపడ్డంలేదు. నిన్ను తప్పవేరే వాళ్ళను చేసుకోను"

వర్మ ముందుకు వచ్చి "ఒరే ఆమె ప్రెగ్నెంటు అయింది. నీవు అంగీకరిస్తే నేను చేసుకొంటాను" దుఃఖం ఎక్కువయి భోరున ఏడ్చేసాడు వర్మ.

"ఎందుకండీ అంత ఇదయిపోతారు. ఇప్పటి వరకు మీ నిర్ణయాలు చెప్పారు. ఇకపోతే నా నిర్ణయం కూడా వినండి? నేను మనోహర్‌ని మనసారా ప్రేమించాను. వివాహం కాకపోయినా మనోహర్ నాభర్త. కొన్ని పరిస్థితుల దృష్ట్యా నాశరీరంలో వర్మ బీజాంకురం పెరుగుతూవుంది. ఆ బీజాంకురాన్ని నేను నాశనం చేయలేను. అలా అని మైలపడ్డ ఈ శరీరాన్ని మనోహర్‌కి అర్పించలేను. వర్మ చేతిలో మలిన మయ్యానని అతనికి భార్యను కాలేను. అతన్ని ఒక స్నేహితునిగానే భావిస్తాను. ఇకపోతే నేను నా బిడ్డను చూసుకొంటూ ఇలాగే ఈ జీవితాన్ని గడిపేస్తాను."

"ఈ తీర్పు ఏ చట్టంలోది" ఆవేదనగా అన్నాడు మనోహర్.

"ఈ తీర్పు ఏ చట్టంలోదీకాదు. నా నిర్ణయం."

"శైలజగారూప్లీజ్. మిమ్మల్ని మీరు శపించుకోకండి" రెండుచేతులెత్తి నమస్కరిస్తూ అన్నాడు వర్మ.

కాని శైలజ నిర్ణయానికి తిరుగులేదు.

• • • • • • • • •

ఇప్పుడు శైలజ కొడుకు మనోహర్‌వర్మకు అయిదు సంవత్సరాలు నిండాయి.

శైలజ, మనోహర్, వర్మ ముగ్గురూ అవివాహితులే. ప్రతి అదివారం ముగ్గురూ పబ్లిక్ గార్డెన్‌లో కలుసుకొంటుంటారు.

ప్రక్క ప్రక్కనే శైలజ, మనోహర్ పార్కు బెంచీ మీద కూర్చొని మనస్సు విప్పి మాట్లాడుకొంటూ నవ్వు కొంటుంటారు. వర్మ పిల్లవాడితో ఆడుకొంటూ పచ్చికలో అతనితో సమానంగా పరుగెడుతుంటాడు.

శైలజ నిర్ణయం....

ఆమెతో బాటు మనోహర్‌ని, వర్మను అవివాహితుల్ని చేసింది

ముగ్గురూ శాశ్వతంగా బ్రహ్మచర్య దీక్ష అవలంబించారు.

అయితే,

మనోహర్ వర్మకు తల్లి శైలజ.

శైలజకు భర్త మనోహర్.

వర్మ సంతానం మనోహర్‌వర్మ.

శైలజ తన మనసుకు తెలిసిన చట్టంతో చేసిన ఈ తీర్పు సాంఘికంగా, ఆర్థికంగా ఆ ముగ్గరిమీదా అధికారాన్ని కలుగజేసింది పసివాడికి ✹

**(విజయ మంత్లీ సెప్టెంబరు, 1986)**